ఫుట్‌పాట్లు

శిథిలమైన పలకలు

- ఫుట్‌పాత్‌లపై పగిలిన సిమెంట్ పలకలు
- క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది వరకు ఇదే పరిస్థితి
- రాకపోకలకు నిత్యం అవస్థలు


చంద్రంపాలెం వద్ద ఇదీ పరిస్థితి


నిత్యం రద్దీగా ఉండే కార్‌షెడ్ జంక్షన్ వద్ద..


చంద్రంపాలెం హైస్కూల్ వద్ద ఫుట్‌పాత్‌పై ప్రమాదకరంగా శ్లాబులు

ఇదీ పరిస్థితి..

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 కేంద్రం మధురవాడ పరిధిలో ప్రజలను ఫుట్‌పాత్‌ల సమస్య వేధిస్తోంది. కొమ్మాది జంక్షన్, డీ మార్టు, మధురవాడ డైలీ మార్కెట్, చంద్రంపాలెం, మిథిలాపురి వుడా కాలనీ, పీఎం పాలెం తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలమయం కాగా.. మిగిలిన ఫుట్‌పాత్‌లపై శ్లాబులు పగిలి ప్రమాదకరంగా తయారయ్యాయి. కొన్నిప్రాంతాల్లో కనీసం ఫుట్‌పాత్ ఎక్కడానికి కూడా అవకాశం లేక పాదచారులు రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది.


రోడ్డు పక్కన ఉన్న స్టాపర్లు, శ్లాబులు

జాతీయ రహదారిని ఆనుకుని ఇరువైపులా కొమ్మాది జంక్షన్ నుంచి క్రికెట్ స్టేడియం వరకు సర్వీసు రోడ్డు ఉంది. దీనిని ఆనుకుని పైపులైన్లు, కాల్వల నిమిత్తం భారీ కాల్వలు కట్టి దానిపై సిమెంట్ పలకలు వేసి సుమారు 8 అడుగుల మేర ఫుట్‌పాత్ నిర్మించారు. జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల పరిధిలోని వేలాది మంది పాదచారులు దీనినే ఏళ్ల తరబడి ఉపయోగిస్తున్నారు. అయితే, ఈ భారీ కాల్వలపై ఉన్న శ్లాబులు కొమ్మాది జంక్షన్, రైతు బజార్, జీవీఎంసీ ఆఫీసు, జాతర, చంద్రంపాలెం హైస్కూల్, చంద్రంపాలెం, వుడా కాలనీ జంక్షన్, కార్‌షెడ్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారాయి. కొన్నిచోట్ల ఈ శ్లాబుల్లో చెత్త చేరి మరింత ఇబ్బందికరంగా తయారైంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా, పెద్ద ప్రమాదాలకే దారి తీసేవిధంగా తయారయ్యాయి. అనేకమంది ప్రమాదాల బారిన పడుతున్న సందర్భాలు ఉన్నాయి. తాజాగా ఓ గోవు కూడా ఇందులో పడి రోజుల తరబడి ఉండిపోయింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఫుట్‌పాత్‌పై శ్లాబ్‌లకు మరమ్మతులు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, పాదచారులు కోరుతున్నారు.

త్వరలో పనులు చేపడతాం

శ్లాబుల మరమ్మతులు, కొత్త పలకల ఏర్పాటు నిమిత్తం రూ.9 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. టెండర్ ప్రాసెస్‌లో ఉంది. 20 రోజుల్లో దాదాపుగా పనులు ప్రారంభం అవుతాయి.
– శ్రీనివాస్, ఏఈ, జీవీఎంసీ ఇంజినీరింగ్ శాఖ


మిథిలాపురి వుడాకాలనీ జంక్షన్ వద్ద ..

మెగా రక్తదాన శిబిరం రేపు


రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాంబాబు, లక్ష్మణరావు

పద్మనాభం: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 21వ తేదీన మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణ రావు తెలిపారు. పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం శిబిరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.రాంబాబు, లక్ష్మణరావు మాట్లాడుతూ పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఈ శిబిరానికి అభిమానులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్య నారాయణ, నాయకులు ఈర్ల ఈశ్వరరావు, తాలాడ పద్మనాభం, నారాయణరావు పైడిరాజు పాల్గొన్నారు.


మంగమారిపేటలో కోతి హల్‌చల్



కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో గురువారం తెల్లవారుజామున ఒక పెద్ద కోతి హల్‌చల్ చేసింది. అటుగా వెళ్తున్న వాకర్స్‌ను పరుగులు పెట్టించింది. ఈ ప్రాంతాలకు సమీపంలో ఉన్న జూపార్కు నుంచి ఈ కోతి తప్పిపోయి వచ్చి ఉండవచ్చని పలువురు అభిప్రాయపడ్డారు.

క్లుప్తంగా

మొగదారమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి పసుపు నీటితో అభిషేకం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో మార్గశిర లక్ష్మి వారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు అభిషేకం, అష్టలక్ష్మి ఆరాధన, శ్రీ మహాలక్ష్మి హోమం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని పసుపు, కుంకుమలతో అర్చించారు.

తీరంలోనే వలలు, పడవలు


తీరానికే పరిమితమైన వలలు, పడవలు

కొమ్మాది: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, బలమైన ఈదురు గాలుల ప్రభావంతో తీర ప్రాంత మత్స్యకారులు వేటకు విరామం ఇచ్చారు. గురువారం కూడా తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు బలంగా వీయడంతో పడవలు, వలలను తీరానికి పరిమితం చేశారు. వరుసగా తుఫాన్లు సంభవించడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నామని ఉప్పాడ, మంగమారిపేట, తిమ్మాపురం, రుషికొండ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వేటకు వెళ్లొద్దని చెబుతున్నారు తప్ప తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదని వాపోయారు.

నేలకొరిగిన ట్రీవాల్


సాగర్‌నగర్ వద్ద నేలకొరిగిన ట్రీవాల్

కొమ్మాది: సాగర్‌నగర్ కూడలి వద్ద కల్వర్టుపై ట్రీవాల్ గురువారం ఉదయం నేలకొరిగిపోయింది. భీమిలి బీచ్ రోడ్డు సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వంలో ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న కల్వర్టులపై ఆకర్షణీయంగా ఈ ట్రీవాల్స్‌ను ఏర్పాటు చేశారు. కొద్దిరోజులుగా ఈ ట్రీ వాల్స్ నిర్వహణను పట్టించుకోకపోవడంతో పలు చోట్ల మొక్కలు ఎండిపోయి, దీనంగా దర్శనమిస్తున్నాయి. నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ట్రీ వాల్స్ కళ తప్పుతున్నాయని పలువురు సీనియర్ సిటిజన్లు, పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వీటి నిర్వహణపై శ్రద్ధ వహించాలని కోరుతున్నారు.

ముగిసిన భగవద్గీత పారాయణ, ప్రవచనాలు


శ్రీవారి సన్నిధిలో ప్రవచనకర్త బలిజిపల్లి స్వాతి తదితరులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి, గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గీతాజయంతిని పురస్కరించుకుని ఈ నెల 2వ తేదీన ప్రారంభమైన సంపూర్ణ భగవద్గీత పారాయణం, ప్రవచనాలు గురువారం ముగిశాయి. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు ప్రవచనకర్త బలిజిపల్లి స్వాతి ఈ కార్యక్రమం నిర్వహించేవారు. ఆమె మాట్లాడుతూ భక్తుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు సత్కరించారు.

కేంద్రమంత్రి అమిత్‌షా రాజీనామాకు డిమాండ్


మాట్లాడుతున్న రాంబాబు

తగరపువలస: దళిత జాతికి అంబేడ్కర్ దేవుడని, అలాంటి మహోన్నత వ్యక్తిని పార్లమెంట్‌లో ఎగతాళి చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని ఉత్తరాంధ్ర మాలమహానాడు అధ్యక్షుడు పతివాడ రాంబాబు డిమాండ్ చేశారు. చిట్టివలసలో గురువారం జరిగిన దళిత సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ పట్ల అమిత్ షా అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇలాంటి మతోన్మాద చర్యలను దేశ ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఖండించాలన్నారు. భరత జాతికి ఆయన క్షమాపణలు చెప్పాలన్నారు. అంబేడ్కర్ పేరును వివాదాల్లోకి లాగడం ఇటీవల ఫ్యాషన్‌గా మారిపోయిందన్నారు. ఎన్నికల సమయంలో అంబేడ్కర్ జపం చేసి.. ఆ తర్వాత ఆయన పేరు చెప్పలేకపోవడం సిగ్గుచేటన్నారు. అమిత్ షా తన వ్యాఖ్యలను ఉప సంహరించుకోవాలని రాంబాబు డిమాండ్ చేశారు.

పంచాయతీరాజ్ కమిషనర్ సందర్శన


పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజకు స్వాగతం పలుకుతున్న ఎంపీడీవో జానకి

తగరపువలస: ఆనందపురం మండలం బోని గ్రామ పంచాయతీలోని సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాన్ని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.కృష్ణతేజ గురువారం సందర్శించారు. ఇక్కడ పంప్‌హౌస్, క్లోరినేషన్, పవర్ సప్లై సిస్టమ్‌లను పరిశీలించారు. ఈ పథకం ద్వారా 910 కిలోలీటర్ల రక్షిత తాగునీరు ప్రతి రోజు మండలంలోని 17 హ్యాబిటేషన్ గ్రామాలకు సరఫరా అవుతుందని అధికారులు ఆయనకు తెలిపారు. 2004లో ప్రారంభమైన ఈ పథకం ఇప్పటికి 20 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. ఆయన వెంట ఎంపీడీవో డాక్టర్ వి.జానకి, జెడ్పీ సీఈవో టి.నారాయణ మూర్తి, డీపీవో ఎం.వి.ఎ.శ్రీనివాసరావు, డ్వామా పీడీ పూర్ణిమ, గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ ఈశ్వరీబాయి తదితరులున్నారు.

ఘనంగా ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు


ఎండాడ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు


కేక్ కట్ చేస్తున్న వైఎంసీఏ ప్రతినిధులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో సియోనురాజు మినిస్ట్రీస్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా క్రిస్మస్ ఆరాధన అనంతరం ప్రార్థనలు, ఏసుక్రీస్తు పాటలు, క్యాండిల్‌లైట్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మార్క్ అనీల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎంసీఏ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు

భీమునిపట్నం: భీమిలి యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బీచ్ సమీపంలోని జీసస్ పార్కు సమీపంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎంసీఏ విశాఖ సబ్‌రీజనల్ వైస్ చైర్మన్ కె.ఎస్.ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న బిషప్ వి.స్టీవెన్ దైవ సందేశాన్ని అందించారు. ప్రజలందరూ ప్రేమ, మంచితనం ద్వారానే ఉన్నత జీవనాన్ని పొందుతారని, అలా అందరూ కలిసి జీవించాలని ఏసుప్రభువు సందేశాన్ని అందించారని తెలిపారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తుపై పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి సంఘం అధ్యక్షుడు వై.లివింగ్‌స్టన్, సభ్యులు ఆర్థర్ సుదర్శన్, ప్రేమానందం, పాస్టర్లు గిడియన్ విజయ కుమార్, విలియం సునీల్‌బాబు, ప్రభాకర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపకరణాల కోసం 150 మంది నమోదు


ఉపకరణాల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న దివ్యాంగులు

పద్మనాభం: ఉపకరణాల కోసం దివ్యాంగులను ఎంపిక చేసేందుకు మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన శిబిరంలో 150 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ మాధవి, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఎంఈవోలు పి.రమణ, ఎస్‌డీ బాబులాల్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరావు, రెడ్డిపల్లి హైస్కూల్ హెచ్‌ఎం ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

సూయజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలి


పనోరమ హిల్స్ వద్ద పరిశీలిస్తున్న జీవీఎంసీ అధికారులు

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డులోని పనోరమ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీలో సూయోజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)ని తక్షణమే వినియోగంలోకి తేవాలని జీవీఎంసీ జోన్–2 ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ ఫణిరాం, సీఎంహెచ్‌వో నరేష్ అధికారులను ఆదేశించారు. ఈ గేటెడ్ కమ్యూనిటీకి చెందిన మురుగునీరు కింద ఉన్న స్థలాల్లోకి ప్రవహించడం వలన ప్రైవేటు వ్యక్తుల ప్లాట్లు, వుడా లేఅవుట్ మురుగుకూపంలా మారిందని పీజీఆర్‌ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం వీరు ఈ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగునీటి నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టాలని కమ్యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. సదరు ఫిర్యాదు వచ్చిన ప్రాంతాలలోనూ పర్యటించి మురుగు నీరు పారుదలకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

కంపు కొడుతోంది


కాలువలో నిల్వ ఉండిపోయిన మురుగునీరు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. సాగర్‌నగర్, ఎండాడ, ముబారక్‌కాలనీ, రాజీవ్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోయి దర్శనమిస్తోంది. ఈ ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీలు మురుగుతో నిండిపోవడంతో దుర్గంధం భరించలేక పోతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, అయినా సంబంధిత జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు


బాల్య వివాహాల అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకులు

తగరపువలస: బాల్య వివాహాల వల్ల అనర్థాలెన్నో ఉన్నాయని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి అన్నారు. వాటిని ప్రోత్సహించవద్దని కోరారు. నయీ చేతన 3.0 కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు, నిరక్షరాస్యత, బాలికలను బాగా పెంచలేమన్న అభద్రతాభావం, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోనన్న భయంతో గతంలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగేవన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని తెలిపారు. అమ్మాయిలకు యుక్తవయసు వచ్చాకే పెళ్లి చేయాలని తెలియజేశారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. అవగాహన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రోణంరాజుకు ఘన నివాళి


ద్రోణంరాజు సత్యనారాయణ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: మధురవాడ అభివృద్ధిలో దివంగత మాజీ ఎంపీ ద్రోణంరాజు సత్యనారాయణ పాత్ర ఎనలేనిదని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ద్రోణంరాజు జయంతిని పురస్కరించుకుని చంద్రంపాలెం కృష్ణానగర్ ద్రోణంరాజు కల్యాణ మండపం ఆవరణలోని ఆయన విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు పిళ్లా సూరిబాబు, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కుడితి రామారావు, ఎండాడ క్వారీ సొసైటీ అధ్యక్షుడు పిళ్లా అప్పన్న, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల నాయకులు పోతిన పైడిరాజు, పిళ్లా వెంకటరమణ, జగ్గుపిల్లి అప్పారావు, నాగోతి తాతారావు, పిళ్లా పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన టార్పాలిన్లు అందించాలి


రైతులకు పంపిణీ చేయడానికి ఆనందపురం పీఏసీఎస్ సిద్ధం చేసిన నాణ్యత లేని టార్పాలిన్లు

తగరపువలస: తుపాన్ల నుంచి రక్షణకు వ్యవసాయశాఖ రైతుల కోసం సిద్ధం చేసిన టార్పాలిన్లు నాణ్యంగా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అప్పులు చేసి పెట్టుబడులు పెడితే, దిగుబడికి వచ్చిన పంట తుపాను కోరల్లో చిక్కుకుని ఉందన్నారు. ఇప్పుడు ఆనందపురం సహకార సంఘం వద్ద టార్పాలిన్ల పేరుతో బ్లాక్‌షీట్లు ఉంచారని, వీటిని సీసీ రోడ్లు వేసేటప్పుడు ముందుగా వేస్తారన్నారు. ఇవి తిరిగి ఇవ్వకపోతే రూ.2వేలు చెల్లించాలని వ్యవసాయశాఖ డిమాండ్ చేయడం సరికాదన్నారు. నాణ్యమైన టార్పాలిన్లు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇద్దరు మహిళలు అదృశ్యం


ఎర్నమ్మ (ఫైల్)


శ్రీదేవి (ఫైల్)

పీఎం పాలెం: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు మహిళల అదృశ్యంపై కేసులు నమోదయ్యాయి. స్థానిక సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. మధురవాడ వాంబే కాలనీలోని ఎస్ఎఫ్–5లో మడిబోయిన రమణ కుటుంబంతో నివసిస్తున్నాడు. అతని భార్య ఎర్నమ్మ(35) ఈ నెల 10 న సాయంత్రం 6గంటలకు ఇంటి నుంచి వెళ్లింది. మరలా తిరిగి రాలేదు. వెదికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మారికవలస ఆర్జీకే కాలనీలో ...

మారికవలస రాజీవ్‌గృహకల్ప కాలనీలోని ఎస్ఎఫ్–2లో వి. బంగారు రాజు నివసిస్తున్నాడు అతని సోదరి శ్రీదేవి (44) మానసిక దివ్యాంగురాలు. ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తెరిపివ్వని వాన


రోడ్డుపై ప్రవహిస్తున్న వాననీరు

పీఎం పాలెం: వాన తెరిపివ్వడం లేదు. అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. లోతట్టు ప్రాంతంలోని రహదారులు జలమయం అయ్యాయి. దీంతో పాదచారులు, ద్విచక్రవాహనచోదకులకు అవస్థలు తప్పలేదు. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.


సౌత్‌జోన్ ఫుట్‌బాల్ పోటీలకు గీతం జట్టు



ఎంపికైన గీతం జట్టు

కొమ్మాది: దక్షిణాది రాష్ట్రాల విశ్వవిద్యాలయాల మధ్య జరిగే సౌత్ జోన్ ఫుట్‌బాల్ (పురుషులు) పోటీల్లో పాల్గొనే గీతం విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్టు క్రీడా విభాగం డైరెక్టర్ యు.విజయ్ కుమార్ తెలిపారు. కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో ఏఐయూ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన పోటీలు జరగనున్నట్లు తెలియజేశారు. గీతంజట్టుకు పి.సృజన్, ఎ.అరవింద్ రాజ్, ఎం.రిజర్డ్, కె.జనార్దన్ తదితరులు పాతినిధ్యం వహిస్తారని తెలిపారు. గీతం జట్టు మేనేజర్‌గా జియాద్, కోచ్‌గా రాజ్ కుమార్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

పెచ్చులూడుతున్నాయ్..


సచివాలయంలో పెచ్చులుగా ఊడిపోతున్న శ్లాబ్

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం–2 మంగమారిపేటలోని సచివాలయం శ్లాబ్ పెచ్చులూడుతోంది. దీంతో ఇక్కడికి వచ్చినవారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సచివాలయం కొండ ప్రాంతం కావడంతో పాములు, విషపురుగులు వస్తున్నాయని ఇక్కడ సిబ్బంది హడలిపోతున్నారు.

విద్యుత్ పొదుపుపై బుర్రకథతో అవగాహన


బుర్ర కథ ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

భీమునిపట్నం: విద్యుత్ పొదుపుపై బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా భీమిలి మెయిన్‌రోడ్డు, గంటస్తంభం వేదిక వద్ద విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్‌శాఖ ఏఈ సకరయ్య మాట్లాడుతూ ఏ విధమైన జాగ్రత్తలు తీసుకుని వాడితే విద్యుత్‌ను పొదుపు చేయవచ్చో వివరించారు.